సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
గురువారం । 8 । ఫిబ్రవరి । 2024

## న్యూస్‌రీల్

### జెన్‌కో పైపులైన్‌ను ఢీకొట్టిన లారీ



మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై గుర్తుతెలియని లారీ జెన్‌కో పైపులైన్‌ను ఢీ కొట్టింది. దీంతో పైపులాక్ ఊడిపోయి నీరు వృథాగా పోయింది. ఈక్రమంలో కొద్దిసమయంపాటు రవాణాకు అంతరాయం ఏర్పడింది. గమనించిన జెన్‌కో అధికారులు మోటార్లు బంద్ చేయించి, పైపులైన్ మరమ్మతు చేపట్టారు.

### హుండీ ఆదాయం రూ.7.33లక్షలు



వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని చారిత్రక రామప్ప ఆలయ హుండీ కానుకాలను బుధవారం లెక్కించగా రూ.7,33,433 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ బిల్లా శ్రీనివాస్ తెలిపారు. గత ఐదు నెలలుగా రామప్పను సందర్శించిన భక్తులు, పర్యాటకులు హుండీలలో వేసిన నగదును దేవాదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షకులు అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించినట్లు ఈఓ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివకుమార్, ఏఎస్సై కృష్ణయ్య, అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్, ఆలయ సిబ్బంది మార్క సంతోష్, శ్రావణ్, దామోదర్, గైడ్‌లు విజయ్‌కుమార్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

### ఈవీఎంల గోదాం తనిఖీ

ములుగు: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంలో ఎఫ్ఎల్‌సీ(ఫస్ట్ లెవల్ చెకింగ్) నిర్వహణ, వెబ్ కాస్టింగ్ గదులను బుధవారం తెలంగాణ సీఈఓ, సహాయ కార్యదర్శి హరిప్రసాద్ తనిఖీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠితో చర్చించారు. జిల్లాలోని ఆయా రాజకీయ పార్టీల సమక్షంలో ఈ నెల 9వ తేదీ వరకు ఈసీఐఎల్ ఇంజనీర్ల బృందం ఆధ్వర్యంలో చేపడుతున్న ఎఫ్ఎల్‌సీ, ఈవీఎం బ్యాలెట్, కంట్రోలింగ్ యూనిట్, వీవీప్యాట్ యంత్రాల వివరాలను కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎలక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

### 10న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన

ములుగు: కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ నెల 10వ తేదీన కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంప్రదాయ, అసంఘటిత రంగంలో స్వహస్తాలతో, పరికరాలతో ఉత్పత్తులు చేసే వారు తమతమ వృత్తుల్లో ఆధునిక ఉపకరణాలను నైపుణ్యంగా వినియోగించేలా చేయడం పథకం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా అధిక సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వివరించారు. ఈ సదస్సులో బ్యాంకర్లు సైతం పాల్గొంటారని తెలిపారు. 18 రకాల కులవృత్తి దారులు, హస్తకళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

### సమ్మక్క-సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలి

ములుగు: ములుగు జిల్లాను అమ్మవార్ల పేరు మీద సమ్మక్క-సారలమ్మ ములుగు జిల్లాగా నామకరణం చేయాలని కోరుతూ ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకిని రాజు, ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముంజాల భిక్షపతిగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట కరపత్రాన్ని ఆవిష్కరించారు. రాష్ట్రంలో గద్వాలకు జోగులాంబ, సిరిసిల్లకు వేములవాడ, కొత్తగూడెంకు భద్రాద్రి, భువనగిరికి యాదాద్రి, భూపాలపల్లికి జయశంకర్ సార్‌ల పేర్లతో ఏర్పాటు చేసిన అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ములుగును మాత్రం విస్మరించిందని ఆరోపించారు. సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి ఈ నెల 23వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్న నేపథ్యంలో అధికారికంగా ప్రకటన చేస్తారని ఆశిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సౌకర్యాలు కల్పిస్తాం



పోలీస్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖారే

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కావాల్సిన మౌలిక సౌకర్యాల కల్పనకు త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. బుధవారం భూపాలపల్లి పోలీస్‌స్టేషన్ ఆవరణలో 18 మంది ట్రాఫిక్ సిబ్బందితో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి కలెక్టర్ భవేష్‌మిశ్రా, ఎస్పీ కిరణ్‌ఖారేలతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు అనుమతులు లేకున్నా ఇక్కడున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకొని 18 మంది సిబ్బందితో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయన్నారు. కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ పట్టణంలో వాహనాల రద్దీ పెరగటంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నందున ప్రభుత్వ అనుమతులు లేకున్నా తనకున్న సిబ్బందిలో కొంత మంది పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ట్రాఫిక్ పోలీసులకు రెవెన్యూ సిబ్బంది తరఫున కావాల్సిన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్‌నాయక్, డీఎస్పీ రాములు, సీఐ నరేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పల్లెల అభివృద్ధే ధ్యేయం**

టేకుమట్ల: పల్లెల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి, వెలిశాల, గర్మిళ్ళపల్లి, ద్వారకపేట, వెంకట్రావుపల్లిబూర్నపల్లి, ఎంపేడు, కుందనపల్లి, బండపల్లి, వెల్లంపల్లి, దుబ్యాల, మందలోరిపల్లి, రాఘవరెడ్డిపేట, రామకిష్టాపూర్(టి), అంకుషాపూర్, సుబ్బక్కపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలోని రూ.2.35 కోట్ల నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, తహసీల్దారు మంజుల, ఎంపీడీఓ అనిత, భాస్కర్, సురేష్, రాజయ్య, సంగి రవి, అశోక్, సతీష్‌గౌడ్, సదానందం, కృష్ణారెడ్డి, శేఖర్, కిరణ్, నరేష్, వీరేశం, అనిల్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

గద్దెల ప్రాంగణంలో భక్తుల సందడి (ఇన్‌సెట్‌లో) మేకపోతుతో సమ్మక్క గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పూజారులు





## గుడిమెలిగె.. భక్తిభావం ఉప్పొంగే!

- మేడారం, కన్నెపల్లిలో అమ్మవార్ల ఆలయాల శుద్ధి
- ముగ్గులతో అలంకరించిన ఆడపడుచులు
- సంప్రదాయంగా వడ్డెల పూజలు





కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో పూజలు చేస్తున్న ప్రధాన పూజారి కాక సారయ్య



మేడారం మహాజాతరకు అంకురార్పణ జరిగింది. బుధవారం సమ్మక్క గుడి, కన్నెపల్లిలో సారలమ్మ గుడిలో గుడిమెలిగె పండుగ పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. పూజారులు ముందుగా సమ్మక్క, సారలమ్మల ఆలయాలను శుద్ధి చేశారు. మేడారంలో సమ్మక్క ఆలయంపై ప్రధాన పూజారి (వడ్డె) కొక్కెర కృష్ణయ్య సమ్మక్క గుడి ఈశాన్యం మూలన ఎట్టి గడ్డి ఉంచారు. కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో సారలమ్మ పూజారి కాక సారయ్య పూజారులతో కలిసి గుడిమెలిగె పండుగ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేడారానికి భక్తులు పోటెత్తారు. శివసత్తుల పూనకాలతో మార్మోగింది. భక్తులు ఎత్తుబంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

- వివరాలు 8లో▸

- ఎస్ఎస్ తాడ్వాయి

## నిధుల వాటాపైనే అందరి ఆశలు

బడ్జెట్ సమావేశాల్లో మనోళ్ల వాయిస్‌పై చర్చ

- నేటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు
- ఉమ్మడి జిల్లా నుంచి 10 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు
- ఎమ్మెల్యేల స్పందనపై జిల్లా ప్రజల ఎదురు చూపు
- బుధవారం రాత్రే హైదరాబాద్‌కు శాసనసభ్యులు



సాక్షి ప్రతినిధి, వరంగల్: కాంగ్రెస్ ప్రభుత్వం నేతృత్వంలో గురువారం నుంచి తొలిసారి తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు సాగనున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో అసంపూర్తి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు, అమలు కాని ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నిధుల కేటాయింపులపై అందరూ ఆశలు పెట్టుకున్నారు. గురువారం నుంచి మొదలు కానున్న శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ఇద్దరు మంత్రులు, ఒక ప్రభుత్వ విప్, 9 మంది ఎమ్మెల్యేలుగా హాజరుకానున్నారు. మొత్తం 12 మందిలో 10 మంది అధికార కాంగ్రెస్ పార్టీ, ఇద్దరు బీఆర్‌ఎస్‌కు చెందిన వారు కాగా.. ఇందులో ఏడుగురు ఎమ్మెల్యేలుగా మొదటిసారి బడ్జెట్ సమావేశాల్లో పాల్గొననున్నారు. మంత్రులు ధనసరి సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, మురళీనాయక్, నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, మామిడాల యశస్విని‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, దొంతి మాధవరెడ్డి, కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరుకానున్నారు. చాలా మంది బుధవారం రాత్రే హైదరాబాద్‌కు చేరుకున్నారు. ఈనేపథ్యంలో గురువారం నుంచి మొదలయ్యే శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న శాసనసభ్యులు ఏయే అంశాలను ప్రస్తావనకు తేనున్నారనే చర్చ జరుగుతోంది.

**ప్రధాన సమస్యలు ప్రస్తావనకు వచ్చేనా?**

హనుమకొండ, వరంగల్‌గా జిల్లాలుగా మారాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలో ఈ రెండు జిల్లాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఈక్రమంలో రెండు ప్రాంతాల్లో అవసరాలపై చర్చకు తేవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. వరంగల్ సెంట్రల్ జైలు ఆవరణలో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తికి కనీసం రూ.350 కోట్లు అత్యవసరం. అలాగే.. నగరంలో గతంలో మంజూరైన ప్రాజెక్టులు, కొత్తగా ప్రకటించినవి అనేకం. వీటిల్లో కొన్ని వరంగల్, కొన్ని హనుమకొండ పరిధిలోకి రానున్నాయి. కొన్నేమో రెండు జిల్లాల పరిధిలోకి రానున్నాయి. ఇవన్నీ సాకారమైతే మహానగరం మెట్రో నగరంగా ఎదిగే అవకాశం ఉంది. ఇప్పటికే పర్యాటక, సాంస్కృతిక నగరంగా ఉన్న వరంగల్‌లో ప్రతిపాదించిన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేస్తే అంతర్జాతీయ స్థాయి నగరంగా రూపుదిద్దుకుంటుందని చెప్తున్నా.. నిధుల కేటాయింపులో ఆ వేగం లేదు. వీటితో పాటు పలు కీలకాంశాలు అసెంబ్లీలో చర్చకు వస్తే మంచిదనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటక ప్రాంతాలకు ప్రసిద్ధి. బొగత, రామప్ప, లక్నవరం, వెయ్యి స్తంభాల గుడి, ఖిలా వరంగల్, పాకాల సరస్సు, పాండవుల గుట్టలు ఇలా ఎన్నో పర్యాటక ప్రాంతాలున్నాయి. వీటిలో సౌకర్యాలు కల్పించి ఓరుగల్లును పర్యాటక స్వర్గధామంగా తీర్చిదిద్దేందుకు నిధుల అవసరం ఉంది. 2004లో చేపట్టిన జేసీఆర్ దేవాదుల ఎత్తిపోతల పథకం అంచనా వ్యయం రూ.16,645 కోట్లకు చేరగా.. ఇప్పటి వరకు రూ.14,016 కోట్లు ఖర్చు చేసినా పూర్తి కాలేదు. 1,686 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉండగా.. ఇప్పుడున్న అంచనాల మేరకు రూ.2,630 కోట్లు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. ప్రాజెక్టు పూర్తయితే ఉమ్మడి వరంగల్‌తో పాటు నల్లగొండ, మెదక్ జిల్లాల్లో 6 లక్షల ఎకరాలు సాగునీరు అందుతుంది.

చర్చకు తేవాల్సిన అంశాలెన్నో.. | మన ఎమ్మెల్యేలు ఏమంటున్నారంటే..

- వివరాలు 8లో▸

## పారిశుద్ధ్య డ్రైవ్‌ను విజయవంతం చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఎస్ఎస్‌తాడ్వాయి: పటిష్ట కార్యాచరణతో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను విజయవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మేడారం మహాజాతరలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌పై బుధవారం ఆదివాసీ భవనంలో గ్రామ పంచాయతీ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాలు, ట్యాంకులు, రోడ్లు శుభ్రం చేయాలన్నారు. జాతరలో సైతం ప్లాస్టిక్ వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా ప్రధాన అజెండాగా ప్రత్యేకాధికారులు పనిచేయాలన్నారు. ఈనెల 14వ తేదీ వరకు నిర్దేశిత కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ విధులలో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. డ్రైవ్ సందర్భంగా గ్రామంలో ఉన్న తాగునీటి పైపులైన్, కుళాయి లీకేజీలను అరికట్టాలన్నారు. గ్రామీణ నీటి సరఫరా అధికారుల సమన్వయంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. వేసవి కాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. అధికారులు జాతర సమయంలో ప్లాస్టిక్ కవర్లను వినియోగించకుండా చూడాలన్నారు. గ్రామంలో చేపట్టాల్సిన పనులు గుర్తించి వారం రోజుల్లో పటిష్ట కార్యాచరణ రూపొందించాలన్నారు. గ్రామాల్లో అధికంగా చెత్త ఉండే ప్రదేశాలను గుర్తించి వాటిని శుభ్రం చేయాలన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించిన తర్వాత మన గ్రామాల్లో స్పష్టమైన మార్పు కనిపించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ నీటి నిల్వ ప్రాంతాల్లో విసరడం, యాంటి లార్వా చల్లడం, ఫాగింగ్ వంటి నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక గ్రామసభలు ఏర్పాటు చేసి మద్యం, మాదక ద్రవ్యాలు, గుట్కా మొదలైన వాటి వినియోగానికి వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం కల్పించాలన్నారు. ప్రజాప్రతినిధులను ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమానికి ఆహ్వానించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీఓ వెంకయ్య, డీఎల్‌పీఓలు పాల్గొన్నారు.

## 11, 12వ తేదీల్లో విద్యా వైజ్ఞానిక మహాసభలు

మంగపేట: ఖమ్మం జిల్లా కేంద్రంలో ఈ నెల 11, 12 తేదీలలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హట్కర్ సమ్మయ్య, పల్లె నాగరాజు పిలుపునిచ్చారు. మహాసభలను పురస్కరించుకుని టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు లావుడ్యా రమేష్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించి మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతరాలు లేని విద్యను అందించడం ప్రధాన ఎజెండాగా తీసుకుని మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూతన జాతీయ విధానం, రాజ్యాంగ విలువలు, ఫాసిజం, బుద్ధిజీవుల పాత్ర, ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ పరిస్థితులు-ఫలితాలు ప్రభావం అనే అంశాల మీద విద్యావేత్తలు ప్రసంగిస్తారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా రాజేందర్, ఉపాధ్యాయులు విష్ణుమూర్తి, ఎస్.సమత, చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య ర్యాలీ



పనులను పరిశీలిస్తున్న సీఈఓ విజయలక్ష్మి



ర్యాలీలో పాల్గొన్న ఎంపీపీ వినోద, ఎంపీఓ రామకృష్ణ

చిట్యాల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవాల్లో భాగంగా బుధవారం ర్యాలీ చేపట్టారు. మండల కేంద్రంలో మండల స్పెషల్ ఆఫీసర్, జెడ్పీ సీఈఓ ఎల్.విజయలక్ష్మి, జూకల్‌లో ఎంపీడీఓ రామయ్య, జడల్‌పేటలో తహసీల్దార్ సుమన్, చల్లగరిగలో ఎంపీపీ దావు వినోద, ఎంపీఓ రామకృష్ణలతో పాటు ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో చేయాల్సిన పనులపై పరిశీలించి వాటిని గుర్తించినట్లు తెలిపారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు మహతి, ఊర్మిళ, తిరుపతి, శివకుమార్, వెంకన్న, రఘుపతి, కృష్ణ, భిక్షపతి, దిలీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## నవ సమాజ నిర్మాణానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్

భూపాలపల్లి: వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపిస్తే నవ సమాజ నిర్మాణానికి కృషి చేస్తానని సెయింట్ పాల్ స్కూల్ అధినేత, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్, ఎంపీ ఆస్పిరెంట్ అభ్యర్థి మోసెస్ ఆనంద్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లోని బేతానియ ప్రధాన మందిరంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఫాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆనంద్‌కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రజా సేవకు అంకితం అయ్యేందుకు తాను సిద్ధమయ్యానన్నారు. అనంతరం జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు ఫాస్టర్ మనోహర్ మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది పేదలకు ఆర్థికంగా, విద్యాపరంగా ఎన్నో సేవలు అందిస్తూ ప్రజల మధ్యలో ఉంటూ, ప్రజా సేవకే అంకితమైన ఆనంద్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు మార్టిన్ లూథర్, గడ్డం ప్రతాప్, జాన్ రమేష్, సుందర్, థామస్, పి.ఇమాన్యుయల్, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

## కనుల పండువగా బొమ్మల కొలువు





ఇల్లంద క్లబ్‌లో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు



బొమ్మల కొలువును వీక్షిస్తున్న శారదబలరాం

భూపాలపల్లి అర్బన్: సింగరేణి లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం బంగ్లాస్ ఏరియాలోని ఇల్లంద క్లబ్‌లో బొమ్మల కొలువును కనుల పండువగా నిర్వహించారు. ఏరియా సేవా సమితి అధ్యక్షురాలు మాధవి బళ్లారి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సింగరేణి సీఎండీ సతీమతి ఎస్. శారదబలరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా సంక్రాంతి లక్ష్మి, అయోధ్య రామ మందిరం నమూనాల బొమ్మలు, బతుకమ్మ, సమ్మక్క సారలమ్మ జాతర, వినాయకుడు, శివుడు, సింగరేణి తల్లి, వివిధ నమూనాలతో పాటు పలు రకాల బొమ్మలతో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరిని ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన ఆటల పోటీల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ సభ్యులు కల్యాణి శ్రీనివాస్, లలితగుప్తా, వాసవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినుల మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

కాటారం:భువనగిరిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహంలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని ఉత్తర తెలంగాణ మాల జేఏసీ కన్వీనర్ పీక కిరణ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఘటన జరిగి నేటికి నాలుగు రోజులు గడుస్తున్నప్పటికి విద్యార్థినుల మృతికి కారణాలను తెలుసుకోకపోవడం విచారకరమన్నారు. విద్యార్థినుల సూసైడ్ నోట్‌పై చాలా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపించారు. భద్రతా వైఫల్యంతోనే ఈ ఘటన జరిగిందని పేర్కొన్నారు. బాలికల కుటుంబాలకు చెరో రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని పీక కిరణ్ డిమాండ్ చేశారు.

కోడితో మొక్కుతున్న మహిళ



## మేడారంలో భక్తుల కోలాహలం

మేడారం భక్తులతో కోలాహలంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు బుధవారం మేడారానికి తరలివచ్చి సమ్మక్క, సారలమ్మను దర్శించుకున్నారు. జంపన్న వాగు వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. పుట్టు వెంట్రుకలు సమర్పించుకున్నారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బంగారం, చీర,సారె, కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మొక్కుల అనంతరం మేడారం పరిసర ప్రాంతాల్లో విడిది చేసి వంటావార్పు చేసుకున్నారు. కాగా, భక్తులు భారీగా తరలిరావడంతో పోలీసులు ట్రాఫిక్ జామ్ కాకుండా వాహనాలను పార్కింగ్ స్థలాల్లోకి మళ్లించారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.



చిన్నారులకు ఎత్తు బంగారం తులాభారం



జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద భక్తుల స్నానాలు



డోలు వాయిద్యాల నడుమ పూనకాలతో దర్శనానికి వస్తున్న శివసత్తులు



గద్దెల ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు




# గుడిమెలిగె.. భక్తజనం మురిసె

## మేడారం, కన్నెపల్లిలో అమ్మవార్ల ఆలయాల శుద్ధి



సమ్మక్క గుడిలో ముగ్గు వేస్తున్న ఆడపడుచులు






పూలు, పసుపు, కుంకుమలతో సమ్మక్క గుడి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న ఆడపడుచులు

- ముగ్గులతో అలంకరించిన ఆడపడుచులు
- సంప్రదాయంగా పూజా కార్యక్రమాలు

**ఎస్ఎస్ తాడ్వాయి:** మేడారంలో సమ్మక్క గుడి, కన్నెపల్లిలో సారలమ్మ గుడిలో బుధవారం గుడిమెలిగె పండుగ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పూజారులు తలస్నానాలు ఆచరించి సమ్మక్క, సారలమ్మ ఆలయాలను శుద్ధి చేశారు. మేడారంలో సమ్మక్క పూజారి సిద్ధబోయిన మునీందర్ ఇంటి వద్ద ఆడపడుచులు పసుపు, కుంకుమ సిద్ధం చేశారు. తొలుత పూజారులు కంకణాలు కట్టుకోగా మునీందర్ ఇంటి వద్ద నుంచి ఆడపడుచులు పసుపు, కుంకమ, పవిత్ర జలం, దూపం పట్టుకుని డోలు వాయిద్యాల నడుమ సమ్మక్క గుడికి బయలుదేరారు. గుడి వద్ద మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. ప్రధాన పూజారి (వడ్డె) కొక్కెర కృష్ణయ్య సమ్మక్క గుడి ఈశాన్యం మూలన ఎట్టి గడ్డి ఉంచారు. ఆడపడచులు సమ్మక్క శక్తి పీఠాన్ని పసుపు, కుంకుమతో అలంకరించారు. సమ్మక్క గుడి గుమ్మం బయట ముగ్గులు వేసి అందంగా అలంకరించారు. అనంతరం గుడిలో పూజారులు అమ్మవారికి ధూప, దీపాలు వెలగించి పూజలు నిర్వహించి యాటను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో పూజారులు సిద్ధబోయిన మునీందర్, మహేష్, దూప వడ్డె దొబె నాగేశ్వర్‌రావు, పగడయ్య, మల్లెల ముత్తయ్య, పూర్ణచందర్, పాపారావు, నర్సింగారావు, సిద్ధబోయిన రమేష్, తదితరులు పాల్గొన్నారు.



కంకణం కట్టుకుంటున్న ప్రధాన పూజారి కృష్ణయ్య



సారలమ్మ దేవాలయంలో అమ్మవారు

**కన్నెపల్లి సారలమ్మ గుడిలో..**

కన్నెపల్లిలోని సారలమ్మ గుడిలో సారలమ్మ పూజారి కాక సారయ్య పూజారులతో కలిసి గుడిమెలిగె పండుగ పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయాన్ని శుద్ధి చేసిన అనంతరం ఆడపడుచులు సారలమ్మ గుడి ఎదుట ముగ్గులు వేసి అలంకరించారు. గుడిలోపలి సారలమ్మ కుండలను పసుపు, కుంకుమతో అలంకరించారు. అమ్మవారికి ధూప, దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా సారలమ్మ గుడి వద్ద మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన పలువురికి పూజారి సారయ్య పసుపు, కుంకుమ అందించారు. ఈ గుడిమెలిగె పూజా కార్యక్రమాలతో జాతర పూజా తంతు ప్రారంభమైంది. కాగా, ఈనెల 14వ తేదీన మేడారం సమ్మక్క, కన్నెపల్లి సారలమ్మ గుడుల్లో మండిమెలిగె పండుగను నిర్వహించనున్నారు.

## గట్టమ్మ ఆలయంలో ..

**ములుగు రూరల్ :** మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతర సందర్భంగా ఆదిదేవత గట్టమ్మ ఆలయంలో పూజారులు శుద్ధి పండుగ నిర్వహించారు. బుధవారం మాఘశుద్ధ పౌర్ణమి రోజుల్లో ఆదివాసీ నాయకపోడు సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా శుద్ధి పండుగ నిర్వహించామని ఆదివాసీ నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ అన్నారు. పూజారులు ఉదయం గట్టమ్మ ఆలయాన్ని శుద్ధి చేసి అనంతరం ఆలయ పరిసరాల్లో ఉన్న సమ్మక్క–సారలమ్మ గద్దెలను శుద్ధి చేసి అలంకరించారు. కార్యక్రమంలో గట్టమ్మ పూజారులు కొత్త సదయ్య, లక్ష్మయ్య, మొగిలి, సమ్మయ్య, రవి, రమేష్, ముత్తేష్, శ్రీకాంత్, లక్ష్మణ్, మహేందర్, పూర్ణచందర్, సరోజన, అనసూయ, లక్ష్మి, సారక్క, తదితరులు పాల్గొన్నారు.



గట్టమ్మ ఆలయ పరిసరాల్లో ఉన్న సమ్మక్క–సారలమ్మ గద్దెలను శుద్ధి చేస్తున్న ఆలయ పూజారులు



ఆదివాసీ మహిళ వద్ద జాతకం చెప్పించుకుంటున్న యువతులు

## జాతర విజయవంతానికి సహకరించాలి

- ములుగు ఎస్పీ శబరీష్
- మీడియా ప్రతినిధులతో సమావేశం

**దామెర:** మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర విజయవంతానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సహకరించాలని ములుగు ఎస్పీ శబరీష్ పేర్కొన్నారు. ఈ మేరకు మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఎస్ఎస్ఆర్ హోటల్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు మేడారం మహాజాతర జరుగుతుందన్నారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా గత జాతరలో పనిచేసిన అనుభవజ్ఞులైన అధికారులను నోడల్ అధికారులుగా నియమించనున్నట్లు వెల్లడించారు. ఎస్పీ, డీఎస్పీ స్థాయి అధికారులతో సహా సుమారు 14వేల మంది పోలీసుల సేవలు వినియోగించుకుంటామన్నారు. అంతేకాకుండా జాతరలో 475 సీసీ కెమెరాలు, 5 డ్రోన్ కెమెరాలు కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అనంతరం మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ మహాజాతర కవరేజీకి ఎలాంటి ఆంక్షలు విధించొద్దని కోరారు. అదే విధంగా మీడియా ప్రతినిధులు సమ్మక్క, సారలమ్మ గద్దెల వద్దకు వెళ్లేందుకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీఐలు కిరణ్, పుల్యాల కిషన్, ఐఅండ్‌పీఆర్ ఏడీ లక్ష్మణ్, ఎస్ఎస్ఆర్ సంస్థల అధినేత నాయినేని సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

**నర్మెట:** విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం మండలంలోని అమ్మాపురంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సలేంద్ర యాదగిరి (45) నూతనగృహ నిర్మాణం తలపెట్టాడు. ఈక్రమంలో పని మనిషితో కలిసి మిషన్ సాయంతో ఇసుక పడుతున్నాడు. ఈ క్రమంలో ఇసుక పేరుకుపోవడంతో గడ్డపారతో మిషన్‌ను పక్కకు తొలగిస్తుండగా విద్యుత్ వైరు తగిలింది. దీంతో విద్యుత్ సరఫరా అయి మృతిచెందాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.



యాదగిరి (ఫైల్)

**బంగ్లాతండాలో యువకుడు..**

**గార్ల:** విద్యుత్‌షాక్‌కు గురై ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం గార్ల మండలం పుల్లూరు పంచాయతీ పరిధి బంగ్లాతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం తండాకు చెందిన జాటోత్ నితిన్ (20) బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఉదయం స్నానం చేసేందుకు వేడినీళ్ల కోసం హీటర్ స్విచ్ ఆన్ చేస్తున్నాడు. ఈక్రమంలో అతుకులు ఉన్న హీటర్ ప్లగ్ వైర్ పట్టుకోగా విద్యుత్ సరఫరా అయి అక్కడికక్కడే మృతిచెందాడు. ఆ సమయంలో తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మోతీలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్ జీనత్‌కుమార్ తెలిపారు. కాగా, మృతుడి తల్లిదండ్రులకు ముగ్గురు సంతానం. అనారోగ్యంతో 5 ఏళ్ల క్రితం పెద్దకూతురు, ప్రస్తుతం విద్యుత్‌షాక్‌తో కుమారుడు నితిన్ మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.



నితిన్ (ఫైల్)

## వలస కూలీ ఆత్మహత్య

**కాటారం:** టైల్స్ పని కోసం రాజస్థాన్ నుంచి వచ్చిన వలస కూలీ ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన కాటారం మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. రాజస్థాన్‌లోని సికార్ జిల్లా సిమోల్ బడి మండలం బింజాసికి చెందిన సురేంద్రసింగ్(33) అదే గ్రామానికి చెందిన భవానిసింగ్, సోహన్‌లాల్ భార్గవ్‌తో కలిసి టైల్స్ వర్క్ కోసం రెండు నెలల క్రితం కాటారం వచ్చారు. ఒంగోలు జిల్లాకు చెందిన మేస్త్రి మాధవరావు వద్ద పనిలో చేరి చింతకాని క్రాస్ సమీపంలోని నిర్మిస్తున్న ఓ ఇంట్లో ఉంటున్నారు. సురేంద్రసింగ్, భవానిసింగ్, సోహన్‌లాల్ కలిసి పనుల నిమిత్తం ఇబ్రహీంపల్లికి వెళ్లారు. సురేంద్రసింగ్ పని మధ్యలో ఇంటికి వచ్చి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోటి కార్మికులు ఇంటికి వచ్చి చూడగా ఆత్మహత్యకు పాల్పడినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. భవానిసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కాగా, రాజస్థాన్‌లోని బాధిత కుటుంబీకులకు పోలీసులు సమాచారం అందించగా ఆర్థిక ఇబ్బందుల కారణంగా వారు రాలేమని చెప్పినట్లు తెలిసింది.

## మిర్చి ధర రూ.23వేలు



మార్కెట్‌కు విక్రయానికి వచ్చిన మిర్చి

**కేసముద్రం:** కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం మిర్చికి గరిష్ట ధర రూ.23,059 పలికింది. మార్కెట్‌కు 2వేలకు పైగా మిర్చి బస్తాలు అమ్మకానికి రాగా, తేజరకం మిర్చికి క్వింటాకు గరిష్ట ధర రూ.23,059, కనిష్ట ధర రూ.11,329 పలుకగా, తాలురకానికి గరిష్ట ధర రూ.12,800, కనిష్ట ధర రూ.10,311 పలికినట్లు అధికారులు తెలిపారు. ఇటీవల మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు ప్రారంభం కాగా, అత్యధిక ధర పలకడం ఇదే మొదటిసారని తెలిపారు.



# చర్చకు తేవాల్సిన అంశాలెన్నో..

## నేటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు

**సాక్షిప్రతినిధి, వరంగల్ :** ఉమ్మడి జిల్లాకు సంబంధించి చాలా అంశాలు అసెంబ్లీలో చర్చకు రావాలని జిల్లావాసులు కోరుతున్నారు.

- గ్రేటర్ వరంగల్ చుట్టుపక్కల ఔటర్ రింగు రోడ్డు పనులకు 2017 అక్టోబర్‌లో అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. రూరల్ జిల్లాలోని టెక్స్‌టైల్ పార్కు స్థలంలోనే శిలాఫలకం వేశారు. నగరం చుట్టూ 69 కిలోమీటర్ల మేర ఔటర్ రింగ్ రోడ్డును ప్రతిపాదించారు. 29 కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ రాంపూర్ నుంచి దామెర వరకు నిర్మించింది. మరో 40 కిలోమీటర్ల మేర పెండింగ్ పడింది.
- వరంగల్ మహా నగరాన్ని అనేక సమస్యలు వెంటాడుతున్నాయి. ముంపు బెడద 15 ఏళ్లుగా ఉంది. వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ మంత్రిగా ఉండగా.. ముగ్గురు ఎమ్మెల్యేలు ఆ పార్టీకి చెందినవారే. వరంగల్ నగరాభివృద్ధితో పాటు వరంగల్, వరంగల్ పశ్చిమతో పాటు వర్ధన్నపేట, పరకాల నియోజకవర్గాల శివారు గ్రామాల్లో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.
- మడికొండలో మూడు నక్షత్రాల హోటల్‌తో సహా, హైదరాబాద్‌లోని హైటెక్స్ తరహాలో అంతర్జాతీయ సమావేశ, వాణిజ్య ప్రదర్శనల కేంద్రం (హైటెక్స్) నిర్మించేందుకు ఉత్తర్వులు వెలువడ్డాయి. దీన్ని పీపీపీ మోడ్‌లో నిర్మించి నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ భూసేకరణ చేసి ఇవ్వాల్సి ఉంది. నిధులిస్తేనే ఇవన్నీ జరిగేది.
- జయశంకర్ భూపాలపల్లి నుంచి ములుగు కొత్త జిల్లాగా ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా పాలనపరంగా ఇంకా కుదుటపడేందుకు వసతులు కల్పించాలి. ఉమ్మడి వరంగల్‌లో పలు ప్రాజెక్టులు, పథకాలపై స్పష్టత ఇచ్చేలా ప్రజాప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రజలు కోరుతున్నారు.
- వరంగల్‌లోని మామునూరులో విమానాశ్రయం రావాలన్న ఎన్నో ఏళ్ల కల నెరవేరడం లేదు. ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు 700 ఎకరాలకుపైగా స్థలం అందుబాటులో ఉంది. మరో 200 నుంచి 400 ఎకరాల భూసేకరణ అవసరమని, గత ప్రభుత్వం సేకరించి ఇస్తామన్నా సాధ్యం కాలేదు. ఇదివరకే మట్టి నమూనా పరీక్షలు కూడా నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వాళ్లు రెండేళ్లుగా భూకేటాయింపుల కోసం ఎదురుచూస్తున్నారు.
- హైదరాబాద్‌లో ఉన్నట్లు వరంగల్‌లోనూ మెట్రో రైలును తీసుకొచ్చేందుకు చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. మెట్రో నియో రైలు ప్రాజెక్టుకు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ సమగ్ర ప్రాజెక్టు నివేదిక రూపొందించి మూడేళ్ల కిందట ప్రభుత్వానికి సమర్పించింది. రూ.1100 కోట్ల అంచనా వ్యయంతో కాజీపేట నుంచి వరంగల్ వరకు 15 కిలోమీటర్ల మేర నిర్మించే ఇందులో సగం నేలపై సగం ఆకాశ మార్గంలో నడిచేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈసారైన నిధులు కేటాయిస్తే ఈ ప్రాజెక్టు ప్రక్రియ ముందుకు సాగే అవకాశం ఉంది.
- కాకతీయ మెగా జౌళి పార్కులో పరిశ్రమల ఏర్పాటు, సౌకర్యాల కల్పనకు గత ప్రభుత్వం రూ.574 కోట్లను మంజూరు చేసి రూ.174 కోట్లు విడుదల చేసింది. ఆమేరకు పలు మౌలిక వసతులు కల్పించగా.. మరో రూ.400 కోట్లు రావాల్సి ఉంది. పార్కులో కొన్ని ప్రాంతాల్లో రహదారులను నిర్మించి, విద్యుత్ సరఫరా కోసం ఉపకేంద్రాన్ని నిర్మించారు. మిషన్ భగీరథ ద్వారా 12 ఎంఎల్‌డీ సామర్థ్యం గల వ్యవస్థను ఇంకా నిర్మించుకోవాల్సి ఉంది. మొత్తం 1200 ఎకరాల్లో పరిశ్రమల స్థాపనకు కావాల్సిన నిధులు, అన్ని రకాల వసతులు తీర్చిదిద్దుకుంటే మరికొన్ని వస్త్ర పరిశ్రమలు వచ్చే వీలుంది.
- భూపాలపల్లికి ఎస్సారెస్పీ, దేవాదుల నుంచి సాగునీటి పంపిణీని మెరుగుపర్చాలి. చిన్నకాళేశ్వరం పూర్తి చేయాలి. ములుగు జిల్లాలో ములుగు, ఏటూరునాగారంలో బస్సు డిపోల ఏర్పాటు, గోదావరి తీర ప్రాంతాల్లో ముంపు నివారణ చర్యల కోసం కరకట్టల నిర్మాణం చేపట్టాలంటే పెద్దమొత్తంలో బడ్జెట్‌లో నిధులు రాబట్టాలి.

## మన ఎమ్మెల్యేలు ఏమంటున్నారంటే..

### అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతా



అసెంబ్లీ సమావేశాలకు తొలిసారి హాజరవుతున్నందుకు సంతోషంగా ఉంది. ఈ సమావేశంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరుతా. ప్రధానంగా విద్య, వైద్యం సేవలు కుంటుపడుతున్నాయి. వీటికి నిధులు మంజూరు చేయాలని కోరుతా. అలాగే, కాళేశ్వరం నీళ్ల తరలింపు, చెరువులకు కాల్వలు తవ్వకం, విద్యుత్, తాగునీరు, తదితర సమస్యలు సమస్యల పరిష్కారానికి నిధుల కేటాయింపు, పెండింగ్ బిల్లుల చెల్లింపు విషయంపై ప్రసంగిస్తా.

–జాటోత్ రాంచంద్రునాయక్, ఎమ్మెల్యే, డోర్నకల్

### వరద నష్టాన్ని వివరిస్తా



భూపాలపల్లి నియోజకవర్గంలో గతేడాది కురిసిన భారీ వర్షాల కారణంగా జరిగిన నష్టానికి నిధులు మంజూరు చేయాలని కోరుతా. దాదాపు 124 చెరువులు తెగిపోయాయి. వరద ఉధృతికి టేకుమట్ల బ్రిడ్జి కొట్టుకుపోయింది. ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లు ధ్వంసమయ్యాయి. వాటి మరమ్మతులతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతా. చెల్పూర్ కేటీపీపీలో మరో 800 మెగావాట్లు విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తాం.

గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్యే, భూపాలపల్లి

### గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని విన్నవిస్తా



ఆదివాసీలు, గిరిజనులకు అందుబాటులో ఉండేలా మహబూబాబాద్ పరిసర ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరుతా. ఇందుకోసం కావాల్సిన స్థలం మానుకోట చుట్టుపక్కల అందుబాటులో ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు అస్తవ్యస్తంగా మారాయి. వీటి నిర్మాణం కోసం నిధులు కేటాయింపు, తాగునీటి ఎద్దడి నివారణతో పాటు విద్యుత్ హైటెన్షన్ లైన్ల షిఫ్టింగ్ కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతా.

–భూక్య మురళీ నాయక్, ఎమ్మెల్యే, మహబూబాబాద్

### ముంపు ప్రాంతాల పరిరక్షణకు నిధులు అడుగుతా



దశాబ్ద బీఆర్ఎస్ పాలనలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం కబ్జాలతో ముంపునకు గురైంది. దీంతో వర్షాకాలంలో నియోజకవర్గంలోని అనేక ప్రాంతాలు ముంపుకు గురై పేదలు అవస్థలు పడుతున్నారు. పేదల కష్టాలు తీర్చడమే కాంగ్రెస్ సర్కార్ లక్ష్యం. ముంపు ప్రాంతాలను ప్రస్తావిస్తూ అభివృద్ధికి నిధులు కోరుతా. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి కనీస మార్జిన్ మనీ చెల్లించి ఆ నిధులు మంజూరయ్యేలా చేసి హనుమకొండను అభివృద్ధి చేస్తా.

– నాయిని రాజేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే, వరంగల్ పశ్చిమ

### జనగామ అభివృద్ధిపై ప్రస్తావిస్తా



జనగామ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. రబీలో వివిధ పంటల సాగుకు కావాల్సిన నీటి విడుదలపై మాట్లాడుతా. అలాగే, అసంపూర్తి పనులు సజావుగా కొనసాగేలా సభ దృష్టికి తీసుకెళ్తా. గృహలక్ష్మి, గొర్రెల పంపిణీ కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు నిధులు విడుదల చేసి న్యాయం చేయాలని కోరుతా.

–పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే, జనగామ

### పేదలకు అనువుగా మా బడ్జెట్



గత ప్రభుత్వం తెలంగాణను అప్పులకుప్పగా మార్చింది. పేదలకు అనువుగా బడ్జెట్ ప్రవేశపెట్టి ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తాం. వర్ధన్నపేటలో మున్సిఫ్ సబ్ కోర్టు మంజూరు కృషి చేస్తా. గత ప్రభుత్వం ఎన్నికల స్టంట్‌గా శిలాఫలకాలు వేసిన వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణం చేపడతాం.

– కేఆర్ నాగరాజు, ఎమ్మెల్యే, వర్ధన్నపేట

## బస్సులో ప్రయాణికుడి మృతి

**హన్మకొండ:** వరంగల్–2డిపో బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి బుధవారం మృతిచెందాడు. ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లి గ్రామానికి చెందిన గడ్డం దామోదర్ ఏటూరునాగారంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో ఏటూరునాగారంలో బస్సు ఎక్కిన దామోదర్ హనుమకొండలో దిగాల్సి ఉంది. ప్రయాణికులు దిగినా దామోదర్ బస్సు దిగలేదు. దీంతో నిద్రలో ఉండొచ్చని కండక్టర్ లేపే ప్రయత్నం చేసినా ఫలితం లేదు. ముఖంపై నీళ్లు చల్లినా స్పందించలేదు. దీంతో సెక్యూరిటీ అధికారులు, డిపో అధికారులకు కండక్టర్ సమాచారం అందించారు. దీంతో 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో దామోదర్ వద్ద ఉన్న ఫోన్ నుంచి చివరగా మాట్లాడిన నంబర్‌కు కాల్ చేసి విషయం చెప్పారు. దామోదర్ కూతురు, అల్లుడు, సతీమణి హనుమకొండ బస్‌స్టేషన్‌కు చేరుకుని, మృతదేహాన్ని వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## 290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

**హన్మకొండ:** హసన్‌పర్తి ఎర్రగట్టు గుట్ట వద్ద 290 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీని టాస్క్‌ఫోర్స్, హసన్‌పర్తి పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న లారీతో పాటు ఒక ద్విచక్ర వాహనం, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యం తరలిస్తున్న సమ్మయ్య శిరిగిరి, మొతం వీరయ్య, మధుకర్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. వీరిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. కాగా, ఈ దాడుల్లో పాల్గొన్న టాస్క్ ఫోర్స్ సీఐ దేవేందర్, రమేశ్, ఎస్సై నిసార్, సిబ్బందిని సీపీ అంబర్ కిశోర్ ఝా అభినందించారు.